

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### హౌ ఈజ్ యువర్ డే?

**అమెరికా తొమ్మిదిసార్లు** వచ్చాక ఇప్పుడు వింతగాలేదు కానీ, మొదటిసారి వచ్చినప్పుడు రెస్ట్‌రూమ్స్ లో కానీ వాకింగ్‌కి వెళ్ళినప్పుడో, మాల్స్‌లోనో మనని చూడగానే తెల్లవాళ్ళు పెదవులు బాగా సాగదీసి తెలిసున్న వాళ్ళని పలకరించినట్లు నవ్వడం. ఇంకా "హౌ ఈజ్ యువర్ డే?" లేదా "హలో ఎంజాయ్ ద డే" అని చెప్పడం చచ్చేటంత వింతగా అనిపించింది.

"హౌ ఈజ్ యువర్ డే?" అని వెళ్ళిపోతున్న ఎర్రటి కుర్రాడిని ఆపి, అక్కడే చెట్టుకింద ఓ బండమీద కూర్చోపెట్టి "పొద్దుటినుండీ మనసేం బాలేదురా ఎల్విస్ .. గ్లూమీ గ్లూమీగా అంటే వర్షం వచ్చేముందు, మబ్బేసి వుంటుంది చూడు అలా వుందిరా నా మనసు. ఏవిటీ? సియోటెల్ వెదర్ అంతేనా? బొత్తిగా భావుకత్వం లేదేంట్రా మా ఆయనలా నీకూనూ? మనసు మబ్బెయ్యడం. వర్షం కురవడం ఏవిటా? రచయిత్రులంటే ఇంత వేళాకోళం అట్రా కుంకా? అసలు ఇలా మబ్బుమబ్బుగా వర్షం తుంపర్లు పడ్తుంటే ఎల్విసా? మేమేం చేస్తామో తెలుసా? వేడివేడి మిర్చి బజ్జీ కానీ, పకోడీలు కానీ టీతో లాగిస్తాం. అవునురా మీరు తాగే టీ ఏవిటిలా దాసిన చెక్క వాసనతో ఛండాలంగా వుంటుందీ? అసలు 'ఛాయ్' అంటే మా ఆర్ టీసీ క్రాస్ రోడ్స్‌లో ప్రెసిడెంట్ కేఫ్‌లో కానీ ఆల్ఫా హోటల్‌లో కానీ తాగాలిరా. 'పౌనీ ఛాయ్' ఈ pouni అంటే మలాయ్ వేసి ఇస్తాడు కదా ఇరానీ హోటల్‌లో. అద్భుతంగా వుంటుంది. ప్రెసిడెంట్ హౌస్‌లో అలౌవ్ చేస్తారా? అంటావా? ఆ ప్రెసిడెంట్ కేఫ్.. ఇరానీ హోటల్.. అందులో 'లుక్మీ' Look me కాదు.. సమోసా నిండా ఉల్లిపాయలు వేసి లోపల బంగాళాదుంపల కూర పెట్టి పైన పుదీనా చట్నీతో.. ఏంటి 'ఐ హేవ్ సం వర్క్ టుడూ'నా? మరి 'హౌ ఈజ్ యువర్ డే' అని అడిగావ్. ఆర్చేవాడిలా తీర్చేవాడిలా.. తీరా చెప్తూ వుంటే, పూర్తిగా వినకుండా వెళ్ళిపోతానంటావ్? అసలే బోలెడు కబుర్లు కడుపు నిండా వుండిపోయి.. ఎవరు కనిపిస్తారా చెప్దాం అని చూస్తుంటే 'హౌ ఈజ్ యువర్ డే?' అని అడిగావు. గ్లూమీ గ్లూమీగా వుందిరా అంటే ఎందుకన్నట్లు కనుబొమలెగరేసావ్? సరే. చెప్దాం అని మొదలుపెడితే చటుక్కున పొయ్యిమీద పాలు పెట్టా.

కుక్కపిల్లని కేజ్‌లో పెట్టా అని గుర్తొచ్చినట్లు పోతున్నావ్?" ఇదంతా మాట్లాడాలనిపించింది. కానీ ఎల్విస్ నన్ను "హౌ ఈజ్ యువర్ డే?" అని అడిగి, పెదవులు సాగతీసి, సెకన్‌లో వందో వంతు సేపట్లో కనుమరుగయ్యాడు.

సెకనులో వందో వంతుసేపా? అని తీవ్రంగా ఆలోచించకండి. అది మా గురువుగారు యండమూరిగారి నవలల ప్రభావం మరి.

ప్రతివాళ్ళూ ఆప్యాయంగా పలకరించడం, నవ్వడం చేస్తారేకానీ ఆగరు.. పరుగులు పెడ్తూ వుంటారు. మా చిన్నప్పుడు వాకింగ్‌లూ, జాగింగ్‌లూ డాక్టర్లు పెదవి విరిచేసి "ఇంక లాభంలేదు. పైవాడి చేత్లోనే వుంది. కానీ రోజూ నడిస్తే అంటే నడిచే స్థితిలో వుంటేనే.. నడిస్తే మంచిది" అనే రోజుల్లో. సామాన్య మానవులకి ఇలాంటి వ్యాయామాలు చెయ్యాలనే ఎరికలేని రోజుల్లో 'పరువమా...చిలిపి పరుగు తీయకే' అంటూ మణిరత్నం ఓ పాటంతసేపు సుహాసిని చేతా, మోహన్ చేతా పరిగెత్తిస్తూ పాటపెట్టడం గుర్తొస్తుంది. వాళ్ళు పాటంతసేపు పరిగెత్తడాన్ని ఓ రోజంతా షూట్ చేసి వుంటారు కదా! అసలు ఆ రోజుల్లో ఎందుకు పరిగెత్తే వాళ్ళు కారూ? అని ఆలోచిస్తే పొద్దుట లేస్తే పాలబూత్‌లో పాలు అయిపోతాయని పరుగు. రేషన్ షాప్‌లో కిరోసిన్ అయిపోయింది అంటాడని పరుగు. కాలేజీకి, బస్ స్టాండ్‌కి పరుగు. ఆఫీస్‌కి మగాళ్ళు సైకిళ్ళ మీద పరుగు. ఆడవాళ్ళకి వంటగదికీ, వీధి గదిలోకీ, బెడ్‌రూంలలోకీ పరుగు. పిల్లలకి రోజంతా గ్రౌండ్‌లో ఆడుకోడానికి పరుగు..ఇంక వేరే వ్యాయామాలూ, వాకింగ్‌లూ అవసరం వుండేది కాదు.

పెరటి గోడమీద నుండి పక్కింటావిడతో గంటల తరబడి ఆడవాళ్ళకి కౌన్సిలింగ్‌లూ, మగవాళ్ళకి రైళ్ళల్లో, ఆఫీస్ బస్సుల్లో పాలిటిక్స్, క్రికెట్, పెరుగుతున్న ధరల గురించి పాడ్‌కాస్టులూ నడిచేవి. ఎక్కడా రూపాయి ఖర్చుపెట్టక్కరలేకుండా. అప్పట్లో సైకియాట్రిస్టులకి ఎక్కువ గిరాకీ వుండేది కాదేమో. ఈ భూత వైద్యులకీ 'చెట్లమందులేసే వాళ్ళకీ'తప్ప.

పిల్లాడు ఎవరితో కలవడంలేదు. మాట్లాడడం లేదు అంటే, ఫకీర్ ఇంత "ఊది" ఊది, చేతికీ కాలికీ నల్లదారం కట్టి, ఓ తాయెత్తు మెడలో వేసేవాడు.

"నూనెగుడ్డ కాల్చి దిష్టి తియ్యమ్మా. పిల్లడు బాగవుతాడు" అని పక్కింటి పిన్నిగారు చెప్పేవారు. ఇలా లక్షలు లక్షలు సైకియాట్రిస్టుల ఫీజ్‌లు లేవు.

అసలు ఉప్మా ఎలా చెయ్యాలీ? పిల్లల్ని ఎలా పెంచాలీ? మొగుడి మీద  అనుమానం వస్తే ఎలా విషయం రాబట్టాలీ? అనే పుస్తకాలూ, యూ ట్యూబ్ వీడియోలుతో పనిలేకుండా, అన్నీ అమ్మమ్మలో, బామ్మలో , అత్తయ్యలో ఉచితంగా బోధనాతరగతులు నిర్వహిస్తూ వుండేవారు. ఇప్పటిలా అన్నింటికీ వర్క్‌షాప్‌లు లేవు. కవిత్వం ఎలా రాయాలో.. కుక్కల్ని ఎలా పెంచాలో, గాలిపటం ఎలా ఎగరెయ్యాలో, వెన్నలోంచి నెయ్యి ఎలా తియ్యాలో అన్నింటికీ వర్క్ షాప్‌లే. చివరికి చీర కట్టడానికీ పంచె కట్టడానికి కూడా. చిలకలు ఎలా చుట్టాలో, మొగలి పువ్వులు ఎలా కుట్టాలో, కాటుకెలా పట్టాలో ఇవన్నీ యూ ట్యూబ్ చూస్తే కానీ తెలీదు ఈ కాలంలో.

అసలు ఇదంతా ఎల్విస్ 'హౌ ఈజ్ యువర్ డే?' అని అడిగినందుకొచ్చింది. ఇలా మన ఊళ్ళో ఏ పక్కింటి రామనాధమో అడిగినా చెప్తామా? "ఆగు అడిగావుగా విని వెళ్ళు. చంటాడికి నీళ్ళ విరోచనాలు.. ఎడదానికి జలుబు. మా ఆయన గోంగూరలో పులుపు ఎక్కువైందని పొద్దుట చిర్రుబుర్రులాడి వెళ్ళాడు. అత్తగారు పెళ్ళయి పదేళ్ళు అవుతున్నా, పెళ్ళిలో మా వాళ్ళు పానకంలో తీపి సరిపడా వెయ్యలేదని ఈవేళ పొద్దుట కూడా దెప్పి పొడిచింది. తొడికోడలికి బావగారు రవ్వల దుద్దులు చేయించారుట. నాకు కాటన్ చీరకూడా కొనలేదు మా ఆయన. మా స్నేహితురాలు సమ్మర్‌కి ఊటీ వెళ్తున్నానని పోజులు కొడ్తోంది. నాకు కోటీకి కూడా దిక్కులేదు. ఇలా నిరుత్సాహంగా సాగుతోంది రోజూ" అని చెప్తామా?

కానీ మా నాలుగేళ్ళ మనవడు మాత్రం "హౌ ఈజ్ యువర్ డే?" అంటే "ఫస్ట్ హాఫ్ ఈజ్ నాట్ సో గుడ్ నానీ.. మాం వాజ్ నాట్ ఎట్ హోం.. సెకండ్ హాఫ్ ఈజ్ ఓకే ఓకే" అన్నాడు. నోరు తెరిచేసాను ఆశ్చర్యంతో.

అసలు రోజుని రెండు భాగాలుగా విభజించడమే ఆ వయసులో మాకు తెలిసేదికాదు. అసలు చిన్నప్పుడు మాకు బాగుండడం బాగోకపోవడం గురించి పెద్దాళ్ళు ఎన్నడయినా ఆలోచించారా అసలూ?

మాకు ఇష్టం వున్నా లేకపోయినా పెద్దవాళ్ళు మొక్కుకుంటే, మా పిల్లల్ని జనరల్ బోగీలో కుక్కి, ఏ తిరుపతో తీసుకెళ్ళేవారు. నాలుగు గుళ్ళకీ ఒకటి ఫ్రీ అంటే, మా ఆడపిల్లలకి కూడా చేయించేసేవారు. పండగలొస్తే, పెద్దమ్మ పిల్లలకీ మాకూ అందరికీ బ్యాండ్ మేళం డ్రెస్సుల్లా ఒకే తాను చింపించి బట్టలు కుట్టించేవారు. చెప్పుకి పిన్నీసులు పెట్టుకుని కుంటుతూ తిరిగినా కొత్త చెప్పులు అంత ఈజీగా కొనేవారు కాదు. ఇప్పుడు ఆమెజాన్, స్విగ్గీ కాదు. పిల్లాడు "రెయిన్‌బో కేక్ కావాలి" అనేలోగా 'బ్లింక్ ఇట్' ఏప్‌లో 'టింగ్' అని డెలివరీ బోయ్ బెల్ కొడ్తాడు. 'బ్లింక్ ఇట్' కనురెప్ప కోట్టేలోపు..

ఔరా! ఎంతటి మార్పూ? ఊళ్ళో ఊళ్ళో ఉత్తరాలు రాసుకునేవాళ్ళం. మూడోనాటికొచ్చేది. పక్క రాష్ట్రం నుండి నాలుగోనాటికొచ్చేది. టెలిగ్రాం మూడు నాలుగు గంటలలో వచ్చేది. మనీ ఆర్డర్ వారం రోజులకి వచ్చేది. ఇప్పుడు ఎన్ని లక్షలైనా ఫోన్‌లో గీకెయ్యడమే .. టంగ్ న అవతలివాడి ఎకౌంట్లో పడడం. ఆవు కొమ్ముకి గుడిలో 'క్యూ ఆర్ కోడ్' తగిలిస్తాడు గోగ్రాసానికి దానం చెయ్యడానికి వీలుగా.. భిక్షగాడు 'కోడ్' పట్టుకుని, ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర కార్ విండో దగ్గరకొస్తాడు. హోటల్‌కి వెళ్తే స్కాన్ చేస్తే కానీ వాడి మెనూ కనిపించదు. సైంటిస్ట్ అయిన మా తోడికోడలు 'నాలాంటి టెక్నాలజీ ఛాలెంజ్డ్ వాళ్ళు ఇంక హోటల్స్‌కీ, సినిమాలకీ వెళ్ళలేమా?' అని దిగులుగా అడిగింది మొన్న. మేధావులైన డాక్టర్లూ, సైంటిస్టులూ, లాయర్లూ లాంటి వారు ఇవన్నీ వేగంగా చూసి నేర్చుకోడానికి పాపం టైం వుండట్లేదు. కానీ "మిక్సీ, వాషింగ్ మెషినూ, డిష్ వాషరూ, హెయిర్ డ్రయ్యరూ నేర్చుకోలేదూ? అలాగే వస్తాయిలే" అని ఓదార్చాను.

ఇప్పుడు మా మనవడికి డయినోసార్స్‌లో ఎన్ని రకాలో వాటి పేర్లేంటో తెలుసు ప్లేస్కూల్‌లోనే. రంగుల్లో ప్రతి షేడ్‌కీ వున్న కలర్స్ పేర్లు తెలుసు. మాకు మెయిన్‌గా వుండే ఇంద్రధనస్సులోని ఏడూ తెలుసంతే. 'FOMO' అంటే ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్ అన్న ఫుల్ ఫార్మ్ నాకు చెప్పాడు. ఇంత మేధస్సు మేం చదువుకునే రోజుల్లో వుంటే అరకొర చదువుల మా

టీచర్లు ఏమయిపోయేవారో పాపం. మాలాగా పెళ్ళయిన ఏడాదిదాకా మాలతీ చందూర్‌దో, సూర్యకాంతందో వంటల పుస్తకం పట్టుకుని 'ఎసరు మరిగాకా బియ్యం పొయ్యాలి' అని నేర్చుకునే అమాయకత్వం ఎవరికీ లేదు. కడుపులో వున్నదంతా కక్కడానికి సోషల్ ప్లాట్‌ఫార్మ్స్ వున్నాయి. జనం ఎలా ఛస్తే ఏం? అని ఎస్.పుసీల ఒకావిడ పాటలు పాడి ఎఫ్.బిలో పెడ్తుంది గార్ధభ స్వరంతో. ఇంకొకావిడ కవితలు రాసి చదివిన వాడి వాతం, కఫం, పిత్తం అన్నీ పోయేట్లు పోస్ట్ చేస్తుంది. ఎవరూ కడుపులో ఏదీ దాచుకోరు. బిడ్డల్ని కూడా. సరోగసీ పద్ధతుందిగా అంటారు. అలా అని ఫ్రీగా ఏదీ దొరకదు.

"మీ బాధలు వినాలా? ఫ్యామిలీ కౌన్సిలర్ ప్రియాబాధురీ గారు వింటారు. మీ సంసారంలో గొడవలు తీరుస్తారు. ఆవిడ మొగుడెప్పుడో ఆవిడ బాధ పడలేక పారిపోయాడు. కన్సల్టేషన్‌కి ఐదువేలు."

"మీ కుక్కపిల్ల ఫుడ్ తినట్లేదా? రంగురాళ్ళ రత్నాకర్‌గారికి చూపిస్తే అదృష్టరాయి ఇస్తారు. దాని మెడలో కట్టండి."

"మీ అమ్మాయి అల్లుడూ కొట్టుకుంటున్నారా? సోణూ స్వామికి పదివేలు ఇవ్వండి. విడాకులు ఎప్పుడొస్తాయో శెలవిస్తాడు."

ఏ రోగానికి ఏ మందు? ఏ రోగం వస్తే ఎంతకాలంలో పోతారు? అది రావడానికి ఏం తినాలి? పోవడానికి ఏం తినాలి? ఇవన్నీ చెప్పడానికి డాక్టర్లే అక్కర్లేదు. పనికి రాని అమ్మలు చాలామంది వున్నారు యూ ట్యూబ్ ఛానెల్స్‌లో. ఉచిత సలహాలిచ్చే అనుచితమ్మలకి గంట కింత అని వాగడానికిడబ్బులు ఇచ్చే బొమన్ టీవీలూ గట్రాలూ వుంటాయి.

ఇంతకీ "ఎలా వున్నారూ? ఏవిటి సంగతులూ?" అని మొక్కుబడిగా అడుగుతారే కానీ మన సమస్యలు విని, ఆర్చడానికీ తీర్చడానికీ కాదు. అమెరికాలో ఎటికెసీ ఎక్కువ. ఎవరైనా మనని చూసి నవ్వితే పలకరిస్తే "ఆర్ యూ ఓకే?" అని అడిగితే మనమూ పలకరింతగా నవ్వి ఊరుకోవాలి అంతే కానీ "ఇదిగో డౌన్ టౌన్‌కి దారెటూ? నాకు కళ్ళు తిరుగుతున్నాయి.. ఇంటి దగ్గర దిగబెట్టు అబ్బాయ్" అనకూడదు ఇక్కడ.

Post your comments







